## క్లుప్తంగా

### పట్టణ సీఐగా కిరణ్


సీఐ కిరణ్

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి పట్టణ సీఐగా తెలబోయిన కిరణ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న జె.మోహన్‌బాబు బదిలీ కావటంతో ఆయన స్థానంలో మహదేవపూర్ సర్కిల్ నుంచి బదిలీపై వచ్చారు. సీఐ కిరణ్ కాగజ్‌నగర్, రామగుండంలలో సీఐగా పని చేశారు. 2011 నుంచి 2014 వరకు వేంసూరు ఎస్సైగా పని చేశారు. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

**తల్లాడ ఎస్సైగా కొండల్‌రావు..**

**తల్లాడ:** తల్లాడ ఎస్సైగా కొండల్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై విలేఖర్లతో మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

**మధిరరూరల్:** మధిర రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఏలూరి నాగేశ్వరరావు, చిలివేరు సాంబశివరావు, పాపట్ల రమేష్ మాట్లాడుతూ.. ప్లాట్‌ఫామ్‌పై ఉన్న పాత షెడ్లకు సంబంధించిన ఐరన్ రాడ్లను, రేకులను తొలగించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అదేవిధంగా ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి పలు సూచనలు చేశారు.

### దివ్యాంగులకు అన్నదానం

**మధిర:** మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవాసదనంలో సోమవారం అన్నదానం చేశారు. మణిదీప్ షట్టర్స్ అధినేత ధూళిపాటి వీరయ్య చౌదరి, కృష్ణకుమారి దంపతుల కుమార్తె, ఎన్ఆర్ఐ గంగవరపు దీప్తి పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా సేవాసదనం నిర్వాహకురాలు స్వర్ణలత దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

### సైన్స్ సెమినార్‌లో గురుకుల విద్యార్థినులు


సెమినార్‌లో పాల్గొన్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

**కొణిజర్ల:** ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన రీసెంట్ ఎడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్ సైన్స్ అనే నేషనల్ రిసెర్చ్ సెమినార్‌లో కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఫిజిక్స్, కెమిస్ట్రీ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సెమినార్‌లో పలు విషయాలపై చర్చించినట్లు అధ్యాపకులు తెలిపారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

**కారేపల్లి:** పట్టుదలతో చదివి.. ఉత్తమ ఫలితాలు సాధించాలని కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు విద్యార్థులకు సూచించారు. సోమవారం కారేపల్లి హైస్కూల్‌లో పది విద్యార్థులకు కందుకూరి గురప్ప జ్ఞాపకార్థం వారి కుమారులు వరప్రసాద్ అందించిన ప్యాడ్లు, పెన్నులను ఎస్సై చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎండీ బాబు, రాములు, ఉపాధ్యాయులు శిరీష తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి బోరు ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న వైద్యాధికారి శ్రావణ్

**బోనకల్:** మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో జీటీ ట్రిబుల్‌ఎస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం తాగునీటి బోరును వైద్యాధికారి శ్రావణ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కమలవాహిని మాట్లాడుతూ.. పాఠశాలలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో జీటీ ట్రిబుల్‌ఎస్ వారు మంచినీటి బోరును వేయించి నీటి ఎద్దడిని తీర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్ ఎర్నెస్ట్‌ఫాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వైద్యశిబిరం విజయవంతం

**ఏన్కూరు:** మండలంలోని కాలనీ నాచారంలో ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు ఎక్కువగా ఉండి, గ్రామస్తులు కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారని తెలిసి వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బి.రాములు పాల్గొన్నారు.

### గంగారం వైద్యాధికారికి సత్కారం

**సత్తుపల్లిరూరల్:** జిల్లాలో ఉత్తమ వైద్యుడిగా ఇటీవల అవార్డు అందుకున్న గంగారం పీహెచ్‌సీ వైద్యుడు ఆర్.అవినాష్‌ను పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సోమవారం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పశుగ్రాసం ధరలు పైపైకి



- ఎకరం ఎండుగడ్డి ధర రూ.9వేలు
- కోత యంత్రాల రాకతో పెరిగిన డిమాండ్
- ఆందోళనలో పాడిరైతులు

**కల్లూరురూరల్:** పాడిపశువులకు ప్రధాన గ్రాసమైన ఎండుగడ్డి ధరలు భగ్గుమంటున్నాయి. రైతులు గతంలో పంటను కూలీలతో కోయించుకోవడంతో ఎండుగడ్డి కోసం అవస్థలు ఉండేవి కాదు. నేటి ఆధునిక యుగంలో యంత్రాలతో కోయించడంతో గడ్డి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఎకరం ఎండుగడ్డి రూ.4 వేలు ఉండగా ప్రస్తుతం 7వేల నుంచి 9వేల వరకు అమ్ముతున్నారు. యంత్రాలతో కోత కోస్తే రూ.5వేల వరకు ఖర్చు అవుతుంది కానీ ఆ గడ్డి పశువులకు పనికిరాదు. కూలీలతో కోత కోయిస్తే 10–12 వేలు ఖర్చు అవుతుంది. పని సులువుగా అయ్యేందుకు కూలీలు పైపైనే కోసి వదిలేస్తున్నారు. దీంతో ఎకరానికి మూడు బండ్లు అవాల్సిన గడ్డి కేవలం ఒక బండే అవుతుంది. రోజువారీ కూలీలతో కోయిస్తే ధర అధికమైన మొదలు నుంచి కోయిస్తే పొడవుగా ఉండి పశువులు తినేందుకు, గడ్డివాములుగా నిల్వ ఉంచేందుకు వీలుగా ఉంటుంది. అయితే రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపడంతో గడ్డికి గిరాకీ పెరిగింది.

**తగ్గిన సాగు విస్తీర్ణం..**

ఈ ఏడాది రబీసీజన్‌లో వరిపంట వేయకపోవడంతో వరి ఎండిగడ్డి కొరత ఏర్పడింది. దీంతో భారీ డిమాండ్ పెరడింది. కల్లూరు మండలంలో 33 వేల ఎకరాల్లో వరిపంట వేయగా సుమారు 8,500 ఎకరాల్లో వరిపంట ఎండిపోయింది. ప్రభుత్వం యాసంగి పంటకు నీరు విడుదల చేయలేమని ప్రకటించడంతో.. రెండో పంట యాసంగికి రైతులు విరామం ప్రకటించారు.

**వరి గడ్డికి పెరిగిన డిమాండ్..**

యాసంగి పంట వేయకపోవటం వల్ల గడ్డికి డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది ఎండిగడ్డి కొరత వల్ల పశువుల యజమానులు అధికధర చెల్లించి గడ్డి కొనుగోలు చేస్తున్నారు. గతంలో కూలీలు కోసిన గడ్డిని రైతులు కొనుగోలు చేసేవారు, ప్రస్తుతం విషన్ల ద్వారా వరిని కోయడంతో పాడిరైతులు గడ్డిని కొనుగోలు చేసేందుకు విముఖత చూపిస్తున్నారు. ఎకరం గడ్డి ధర తొమ్మిదివేల వరకు ధర ఉండడమే కాకుండా కొరత ఉండడంతో.. కల్లూరు, మధిర ,బోనకల్లు, పెనుబల్లి, వేంసూరు, తల్లాడ, మండలాలతోపాటు ఏపీలోని తిరువూరు, గంపలగూడెం తదితర ప్రాంతాల వారు తీసుకెళ్తున్నారు.

**పశువుల పెంపకంపై తీవ్ర ప్రభావం..**

వరి ఎండిగడ్డి కొరత వలన పశువుల పెంపకంపై తీవ్ర ప్రభావంపడింది. దీంతో చిన్న, సన్నకారు రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పశుగ్రాసం కొరత మరింత పెరిగే అవకాశముంది. మార్కెట్‌లో దాణా ధరలు పెరిగిపోవటంతో రైతులు పశువుల దాణా కొనలేని పరిస్థితి ఉంది. దీంతో కొందరు రైతులు పాడి పశువులు, ఎద్దులను అమ్మేస్తున్నారు. మరికొందరు రైతులు వ్యవసాయ పనులను దృష్టిలో పెట్టుకుని తప్పని పరిస్థితుల్లో ఆర్థిక భారాన్నిమోస్తున్నారు.

**జాడు విత్తనాలు సరఫరా చేయాలి..**

పశుగ్రాసం కొరత ఏర్పడినప్పుడు ప్రభుత్వం రైతులకు సబ్సీడీపై జాడు విత్తనాలు సరఫరా చేస్తుంది. పశుగ్రాసం కొరత ఉన్న ప్రాంతాల రైతులు పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదించినట్లయితే ప్ర భుత్వం ద్వారా విత్తనాలు అందించే అవకాశముంది.

**పశుపోషణ భారంగా మారింది..**



పశుగ్రాసం కొరత వల్ల పశుపోషణ భారంగా మారింది. ఈ ఏడాది ఖరీఫ్ ఒకే పంట వేశారు. రెండో పంట యాసంగి వేయకపోవటం వల్ల వరి ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. మార్కెట్‌లో దాణా కొనుగోలు చేయాలంటే ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఖర్చు. తనకున్న వరిగడ్డితోనే పొదుపుగా పశువులకు వేస్తున్నాను.

– కర్నాటి పిచ్చిరెడ్డి, రైతు, కప్పలబంధం

**దాణా ధరలు తగ్గించాలి..**



పశువుల దాణా ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పశువులను పెంచడం ఖర్చుతో కూడిన వ్యవహారంగా మారింది. ఈ ప్రాంతంలో పండే వరిపంట ఎండుగడ్డి ఈ ప్రాంత పశువులకు సరిపోవటం లేదు. బయట వారు ఇక్కడ వచ్చి ఎండుగడ్డి కొనుగోలు చేసి తీసుకెళ్లటం వల్ల కొరత ఏర్పడుతుంది.

– రంగు లక్ష్మణ్‌రావు, రైతు, పుల్లయ్య బంజరు

# ‘ఉపాధి’ కూలీలకు వేతనాలు పెంచాలి


మధిర: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

**మధిర/చింతకాని/ముదిగొండ:** ఉపాధిహామీ కూలీలకు వేతనాలను పెంచాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్లు రమేష్, వెంకటేశ్వర్లు, రామారావులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తేలప్రోలు రాధాకృష్ణ, జిల్లా డీవైఎఫ్ఐ అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, మండల కార్యదర్శులు వత్సవాయి జానికీరాములు, వేల్పుల భద్రయ్య, అధ్యక్షుడు దేశబోయిన ఉపేందర్‌లు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధిహామీ పనులకు బీజేపీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని, అర్హులైన పేదలందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని కోరారు. అదేవిధంగా మున్సిపాలిటీ, పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధిహామీ పనులు కల్పించాలన్నారు. రైతు సంఘం నాయకులు వూట్ల శంకర్ రావు, వెల్సన్, కృష్ణ, పంగా గోపయ్య, గడ్డం కోటేశ్వరరావు, జాజాల నాగరాజు, సూత్రపు గంగాధర్, మర్లపాటి వెంకటేశ్వరరావు, సీతయ్య, సైదులు, నరసింహారావు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

### ఉపాధిహామీ పనులపై గ్రామసభ


మాట్లాడుతున్న డీఆర్పీ దేవోజి

**ఎర్రుపాలెం:** మండలంలోని జమలాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ పనుల నిర్వహణపై సోషల్ ఆడిట్ సిబ్బంది ఉప సర్పంచ్ ఉయ్యూరు మల్లిక అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ డీఆర్పీ దేవోజి మాట్లాడుతూ.. జూలై 1, 2021 తేది నుంచి మార్చి 2023 వరకు జరిగిన 31–3–23 వరకు జరిగిన ఉపాధిపనులపై ఆడిట్ నిర్వహించినట్లు వివరించారు. గ్రామంలో మొత్తం 139 పనులు జరిగాయన్నారు. తనిఖీలో భాగంగా ఇంటింటికి తిరిగి కూలీలతో మాట్లాడి ఆడిట్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం సొసైటీ అధ్యక్షులు మూల్పూరి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి వరికూటి సురేష్ బాబు ఉన్నారు.

### పేదలకు ‘ఉపాధి’ పనులు కల్పించాలి..


ఉపాధిహామీ కూలీలతో దండు ఆదినారాయణ

**సత్తుపల్లిరూరల్:** గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా పేదలకు పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. సత్తుపల్లి మండలం రామానగరం గ్రామంలో సోమవారం ఉపాధిహామీ కూలీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి వ్యవహరిస్తున్నారని, ఉపాధిహామీ పథకంలో 30వేల కోట్ల రూపాయల నిధులు తగ్గించి ఉపాధిహామీ కూలీల పొట్ట కొట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాములు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, రజిని, లక్ష్మి, రాములమ్మ, సుజాత, శ్రీలత, సత్యభామ, లక్ష్మి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి


గ్రామసర్పంచ్‌లను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, మండల అధికారులు

**చింతకాని:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. గ్రామాల్లో వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, డంపింగ్ యార్డు, క్రీడా మైదానం, రైతువేదికలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు పెద్దఎత్తున నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ నెల 31వ తేదీతో గ్రామసర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున మండల అధికారులు సర్పంచ్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, గ్రామసర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

**మల్సూర్‌తండా పాలక వర్గాన్ని సన్మానించిన ఎంపీపీ..**

**తల్లాడ:** మండలంలోని మల్సూర్‌తండా గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని సోమవారం తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు సర్పంచ్ మాలోత్ కల్యాణి, ఎనిమిది మంది వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైరా ఎఎంసీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, ఎంపీటీసీ బానోత్ మోహన్, మాజీ సర్పంచ్ లింగయ్య, పంచాయతీ కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

### 31న శివాలయంలో వేలంపాట

**కల్లూరు:** స్థానిక శివాలయ ప్రాంగణంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని మూడు రోజులపాటు నిర్వహించే జాతరలో షాపుల కోసం ఈ నెల 31న ఉదయం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంపాట కాల పరిమితి ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఉంటుందన్నారు. వివరాలకు సెల్‌నంబర్లు 81795-36850, 9505474358 ను సంప్రదించాలని కోరారు.

### శ్రీకృష్ణ గోశాలకు పశుగ్రాసం

**కల్లూరురూరల్:** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ గోశాలకు కల్లూరు నుంచి 14ట్రాక్టర్లు పశుగ్రాసం వితరణ చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వరావు, పసుమర్తి చందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు షేక్ యాఖుబ్‌అలీ, ఉబ్బన గోపాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ

**కల్లూరురూరల్:** కల్లూరు మండలం పేరువంచ ఉన్నత పాఠశాలలోని పది విద్యార్థులకు ప్రముఖ సామాజికవేత్త తోపుడుబండి అధినేత సాదిక్ అలీ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10/10 మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ.25,000లు ప్రత్యేక బహుమతి అందిస్తామని తెలిపారు. అలాగే వృత్తి విద్యలో భాగంగా పాఠశాలకు 3కొత్త కట్టు మిషన్లను ఆయన ప్రకటించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం సాదిక్ అలీని ఘనంగా సత్కరించారు. హెచ్ఎంసుదర్శన్, ఉపాధ్యాయులు మౌలాలీ, శ్రీనివాసరావు, శిరీ ష, సుజాత, రామానాయక్, సాగర్, మధుశ్రీ , హేమలత, జాని పాల్గొన్నారు.

### రూ.లక్షతో క్రీడాప్రాంగణం బాగు


కళాశాలలో బాగుచేసిన క్రీడా మైదానం

**ఏన్కూరు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని శెట్టిపల్లి నారాయణ, బసవమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాగు చేశారు. క్రీడా ప్రాంగణంలో ముళ్లపొదలు, చెట్లు పెరిగిపోయి విద్యార్థులకు ఆటాలాడుకునేందుకు అనువుగా లేకపోవడంతో స్పందించిన ట్రస్ట్ నిర్వహకులు డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరావు రూ.లక్షతో క్రీడా మైదానాన్ని అందంగా తయారు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

### కృష్ణంరాజుకు నివాళి

**తల్లాడ:** మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ శ్రీ నాథ కృష్ణంరాజు (72) సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన మృత దేహాన్ని మండల కాంగ్రెస్ నాయకులు అయి లూరి బాబు, అన్నెం కోటిరెడ్డి, పోతురాజు కోటయ్య, తోటకూరి శేషగిరిరావు, కర్నాటి క్రిష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

# ఘనంగా ఉర్సు మహోత్సవం


దర్గాలో చాదర్ సమర్పిస్తున్న నాయకులు

**వైరా:** వైరా బ్రాహ్మణపల్లిలోని హజరత్ సయ్యద్ యాకూబ్‌షా వలీ ఉర్సు మహోత్సవం రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి సందిల్ ఊరేగింపు నిర్వహించారు. మత పెద్ద షేక్ జమాల్ ఇంటి వద్ద నుంచి చాదర్‌ను మేళ తాళాలతో తీసుకొచ్చి సమర్పించారు. కందిల్ ఊరేగింపు రాత్రి 10.30 గంటలకు ప్రారంభమై సోమవారం తెల్లవారుజామున ముగిసింది. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలను కలిసిన సుదర్శనం


మంత్రి తుమ్మలను కలిసిన టీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ ఎండీ సుదర్శనం, నాయకులు

**కల్లూరు:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం ఆయన గృహంలో కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు ఆధ్వర్యంలో గండుగుల పల్లిలో తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ ఎండీ సుదర్శనం కలిశారు. దళిత క్రైస్తవులను ఎస్సీలలో చేర్చడం, ప్రతి జిల్లా, మండల కేంద్రంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేపట్టాలని, తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, చర్చిలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం, చట్ట సభలలో క్రైస్తవులకు అవకాశం కల్పించడం గురించి, పాస్టర్లకు మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ప్రతి నెలా గౌరవ వేతనం ఇవ్వడం, మండలం, క్రైస్తవుల కోసం జిల్లా కేంద్రాలలో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయడం తదితర తంశాలకు సంబంధించి వినతిపత్రాన్ని మంత్రి తుమ్మలకు అందించారు. కార్యక్రమంలో టీసీసీ రాష్ట్ర ముఖ్య సలహాదారుడు కె.దేవ మందిరం, రాష్ట్ర కన్వీనర్ ఎం.నిరీక్షణరావు, పాస్టర్ పీటర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉత్తమ ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**మధిరరూరల్:** మధిర పట్టణంలోని టీవీయం పాఠశాలలో సోమవారం జరిగిన స్పెల్ విజార్డ్ అండ్ డ్రామా పోటీల్లో మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. మహాత్మాగాంధీ ఆఫ్ ట్రైన్ స్కిట్‌ని ప్రదర్శించి ఉత్తమ ప్రతిభను చాటారు. ఈ విద్యార్థులను ఇంగ్లీష్ ఉపాధ్యాయులు తోట నరసింహారావు, జ్యోతిర్మయి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సాధు సమాధానం, ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా స్పెల్లింగ్ రాత పరీక్షలో డ్రామా/స్కిట్ పోటీల్లో మర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందారు. గెలిచిన విద్యార్థులకు మండల ఎల్టా(ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) సభ్యులు తోట నరసింహారావు, కోట వెంకట్, శ్రీను, వెంకట్, జ్యోతిర్మయి, ఫాతిమా తదితరులు అభినందించారు.

**విద్యార్థులకు నాటక పోటీలు..**

**ముదిగొండ:** ముదిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పెల్ విజార్డ్ అండ్ డ్రామా పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత విద్యార్థులు రెహాన్, శ్రీమన్యలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. నాటిక పోటీల్లో మేడేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, వల్లబి జిల్లాపరిషత్ ఉన్నత విద్యార్థులు ద్వితీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామాచారి, ప్రధానోపధ్యాయురాలు శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కనీస సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న రాయల వీరస్వామి

**మధిర:** ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రాయల వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు. మధిర టీవీఎం పాఠశాలలో సోమవారం మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఎంఈఓ వై.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నప్పటికీ ఇంకా సబ్జెక్ట్ టీచర్ల కొరత వేధిస్తుందన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా తగిన చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని తెలిపారు. స్వీపర్, నాన్ టీచింగ్ సిబ్బంది లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని పేర్కొన్నారు. పరీక్షలు దగ్గరకు వస్తున్న క్రమంలో విద్యార్థులకు ప్రత్యేక క్లాసుల నిర్వహణ కష్టమవుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో ఎస్ఎస్‌సీ ఫలితాల సాధన ఎలా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుగ్గినేని నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ దామాల పుల్లయ్య, సర్వశిక్ష అభియాన్ మన ఊరు – మన బడి జిల్లా సెక్టోరియల్ అధికారి సీహెచ్ రామకృష్ణ, పాల్వాయి వెంకటేశ్వరావు, రాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### డీసీసీబీ చైర్మన్ పదవి మల్లిబాబుకు ఇవ్వాలి

**తల్లాడ/కొణిజర్ల:** ఖమ్మం డీసీసీబీ చైర్మన్ పదవిని మేకల మల్లిబాబు యాదవ్‌కు కేటాయించాలని యాదవ సంఘం జిల్లా కార్యదర్శి గూడె భద్రయ్య, తల్లాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు డేగల సురేష్, మద్దిబోయిన పంపాద్రి తెలిపారు. తల్లాడ, కొణిజర్లలో సోమవారం నిర్వహించిన యాదవ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మల్లిబాబు యాదవ్ గత 25 సంవత్సరాలుగా రాజకీయ నాయకుడిగా ఎదిగారనీ, గొర్రెల మేకల పెంపకం జిల్లా అధ్యక్షుడిగా కారేపల్లి మండల జెడ్పీటీసీగా గతంలో సేవలందించారని తెలిపారు. మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టి విక్రమార్క ఆశీస్సులతో మల్లిబాబు యాదవ్‌కు డీసీసీబీ చైర్మన్ పదవి కట్టా బెట్టాలని వారు కోరారు. గొర్రెల పంపిణీకి డీడీలు కట్టిన పెంపకందార్లకు ప్రభుత్వం తిరిగి డబ్బులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు రవికుమార్, పదిమల నరేష్, చింతల ఎల్లిబాబు, బండారు కిషన్‌రావు, తద్దె మహేష్, ఇమ్మడి రామారావు, కూరాకుల నర్సయ్య, నాగరాజు, చింతల లక్ష్మీనరసింహారావు, యాదవ సంఘం నాయకులు రాచబంటి పాపారావు, రాజబోయిన సైదులు, నల్లగొర్ల నరసింహారావు, గోపదేశి రాంబాబు, ఎనిక గణేష్, పాముల నరసింహారావు, ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

### సభను జయప్రదం చేయండి

**కొణిజర్ల:** ఫిబ్రవరి 4న నేలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సభలను జయప్రదం చేయాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శాంతకుమారి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొణిజర్లలో సోమవారం జిల్లా సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ లాల్ సయ్యద్, ప్రసాదరావు, హనుమా, కార్యకర్తలు విజయలక్ష్మి, హృదయలక్ష్మి, సీత, శారద, కృష్ణవేణి, శ్రీదేవి, లావణ్య, భాస్కర్ పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అలనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**వైరా:** స్థానిక ఠాగూర్ విద్యాలయంలో 2014-15 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ వివిధ వృత్తులలో జీవితంలో స్థిరపడ్డ యువతీ యువకులు పాఠశాలను గుర్తు పెట్టుకుని ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, రామకృష్ణ , వేణు, నాగరాజు, రాంబాబు, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు,

# చెత్త ట్రాక్టర్లను అడ్డుకున్న కాలనీ వాసులు



**సత్తుపల్లిటౌన్:** మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తా చెదారాన్ని ట్రాక్టర్లపై తీసుకొచ్చి స్థానిక జవహర్‌నగర్ నివాస ప్రాంతాలకు సమీపంలోని పాత ఎన్టీఆర్ కాలువలో పోసేందుకు ప్రయత్నించగా సోమవారం కాలనీవాసులు అడ్డుకున్నారు. ఊళ్లో చెత్త అంతా తెచ్చి నివాసాల దగ్గర పోస్తే దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేక పోతున్నామని.. చెత్త తగలపెట్టడం వల్ల పొగతో అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు వాపోయారు. దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది రోగాలబారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కొమ్మేపల్లిలో మున్సిపాలిటీ, డంపింగ్ యార్డ్ ఉన్నప్పటికీ కాలువలో పోయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.సుజాతను వివరణ కోరగా కాలువలో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.